సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 6 । జూలై । 2023



చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి.



మెరుగైన వైద్యం అందించండి

హిందూపురం జిల్లా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. 8లో

గరిష్టం/కనిష్టం
32.8°/ 21.2°

జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

'పురం'లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: రానున్న ఎన్నికల్లో హిందూపురంపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ తెలిపారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా దీపికను నియమిస్తూ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని అందరూ ఆమోదించాల్సిందేనన్నారు. అధిష్టాన నిర్ణయం తనకు శిరోధార్యమని, పార్టీ పటిష్టత కోసం అందరం కలసికట్టుగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీగా ప్రజల కోసం, పార్టీ నాయకులు, కార్యకర్తల బాగోగుల కోసం కష్టపడి పని చేయడంలో ఎప్పుడూ ముందుంటానన్నారు. వ్యక్తిగత పనుల మీద హైదరాబాద్ వెళ్తున్నానని, తిరిగి వచ్చాక అందరినీ కలుపుకుని పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్ అయూబ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బోధనా ప్రమాణాలు మెరుగుపడాలి

- ఆర్‌జేడీ నాగలింగారెడ్డి



తనిఖీ చేస్తున్న ఆర్‌జేడీ నాగలింగారెడ్డి

పుట్టపర్తి టౌన్: విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో బోధనా ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలని అధ్యాపకులకు ఆర్‌జేడీ డాక్టర్ నాగలింగారెడ్డి సూచించారు. బుధవారం ఆయన బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తనిఖీ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ లక్ష్మయ్య అధ్యక్షతన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి అధ్యాపకుల బోధన ప్రమాణాలను, ప్రామాణికతను అడిగి తెలుసుకున్నారు. నూతన విద్యావిధానంలో వస్తున్న సరికొత్త మార్పులను విద్యార్థులు గ్రహించి తమ అభ్యాసనను మెరుగు పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు ఓబయ్య, ఆదినారాయణ, చంద్రమోహన్, దస్తగిరి, నాగేంద్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

మీరు వెళ్లొద్దు మాస్టారు



శివన్నను చుట్టుముట్టిన విద్యార్థినులు

మడకశిరరూరల్: గురువు తల్లిదండ్రులతో సమానం అంటారు. విద్యా బుద్ధులే కాదు విద్యార్థి భవితకు బాటలు వేసేదీ గురువే. బెత్తంతో భయపెట్టినా ఆ వెంటనే ఆర్తిగా దగ్గరకు తీసుకుంటారు. అందుకే విద్యార్థులంతా అలాంటి గురువుల చుట్టే తిరుగుతూ ఉంటారు. వారు రెండురోజులు పాఠశాలకు రాకపోయినా పిల్లలకు ఏమీ తోచదు. అలాంటిది ఏకంగా పాఠశాల నుంచి బదిలీ అయితే. ఆ పిల్లల బాధ వర్ణించలేం. మడకశిర మండల పరిధిలోని గౌడనహల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. పాఠశాల హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు శివన్న, రామాంజనేయులు, పర్వీన్ బదిలీ కాగా, బుధవారం వారికి విద్యార్థులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు శివన్నను విద్యార్థులంతా చుట్టుముట్టారు. ఆయన మడకశిర బాలికోన్నత పాఠశాలకు బదిలీ కాగా, అక్కడకు వెళ్లవద్దని ఇక్కడే ఉండాలని విద్యార్థులు పట్టుబట్టారు. ఆయన చుట్టూ చేరి కంటతడి పెట్టారు. వారి ప్రేమతో ఉపాధ్యాయుడు శివన్న విద్యార్థులను అక్కునచేర్చుకుని సముదాయించారు. బాగా చదువుకోవాలని సూచించారు.

ఎస్జీటీలకు పదోన్నతులు

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో అర్హులైన 45 మంది ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. బుధవారం అనంతపురం సైన్స్ సెంటర్‌లో డీఈఓ సాయిరామ్ ఆధ్వర్యంలో పదోన్నతుల కౌన్సెలింగ్ జరిగింది. 22 మంది పీఈటీలకు ఫిజికల్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్‌కు సంబంధించి 14 మందికి గాను ముగ్గురు నాట్ ఆప్టెడ్ ఇచ్చారు. 11 మందికి పదోన్నతులు కల్పించారు. ఇక ఎస్ఏ గణితానికి సంబంధించి గణితం ఉర్దూ, వీహెచ్ కేటగిరీలో అభ్యర్థులు లేరు. తక్కిన 12 మందికి పదోన్నతులు కల్పించారు.

నిధులు దండి.. సిరులు పండి



రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం...రైతు వేసే ప్రతి అడుగులోనూ తోడుగా నిలుస్తోంది. విత్తనం వేసింది మొదలు...పంట విక్రయించే దాకా అన్ని విషయాల్లో అండగా ఉంటోంది. పంట పండితే గిట్టుబాటుధర...పంట నష్టపోతే పరిహారం ఇస్తోంది. అలాగే రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వడంతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తూ వ్యవసాయాన్ని పండుగ చేస్తోంది.

- రైతన్నకు తోడుగా నిలుస్తున్న జగన్ సర్కార్
- ఏడాదిలోనే రూ.892 కోట్ల ఆర్థిక సాయం
- బ్యాంకు నుంచి రూ.2,559 కోట్ల రుణాలు అందజేత
- ప్రతి పథకంలోనూ రైతుకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక
- రైతు భరోసా కేంద్రాలతో గ్రామాల్లోనే సకలం

జిల్లాలో రైతులు	3,65,875 మంది
సాధారణ సాగు విస్తీర్ణం	3,23,763 హెక్టార్లు
వ్యవసాయ శాఖ ద్వారా చేసిన ఖర్చు	రూ.814.15 కోట్లు
ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో	రూ.6.06 కోట్లు
ఏపీఎంఐపీ శాఖ ద్వారా	రూ.58.84 కోట్లు
సెరికల్చర్ శాఖ ద్వారా	రూ.10.98కోట్లు
పశు సంవర్ధక శాఖ ద్వారా	రూ.2.50 కోట్లు
మొత్తం	రూ.892.53 కోట్లు

పుట్టపర్తి అర్బన్: రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని తరచూ చెప్పే సీఎం జగన్ అన్నింటా రైతన్నకే ప్రాధాన్యం ఇచ్చారు. ప్రతి పథకాన్నీ వర్తింపజేస్తూ అన్నదాత ఇంట సంతోషాలు నింపుతున్నారు.

ఏడాదిలోనే రూ.892 కోట్లు జమ

జిల్లాలోని రైతుల ఖాతాల్లో ఒక్క 2022–23 ఆర్థిక సంవత్సరంలోనే జగన్ సర్కార్ ఏకంగా రూ.892 కోట్లు జమ జేసింది. దీంతో పాటు బ్యాంకుల ద్వారా మరో రూ.2,559 కోట్లు రుణాలు అందించింది. వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశు సంవర్ధక, మత్స్య శాఖలతో పాటు ఏపీఎంఐపీ సహకారంతో ఎన్నో పథకాలను రైతులకు అందిస్తున్నారు.

ముంగిళ్లలో సేవలు..

ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం సేవలన్నీ ముంగిళ్లలోనే అందిస్తోంది. రైతుకు నాణ్యమైన సబ్సిడీ విత్తనం, కల్తీ లేని ఎరువులు, పురుగు మందులు, సాగులో మెలకువలతో పాటు పంట పండితే కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధరతో సేకరిస్తోంది. ప్రకృతి విపత్తులతో పంటలకు నష్టం జరిగితే పరిహారం ఇస్తోంది. అలాగే మట్టి పరీక్షలు, యంత్రసేవ ద్వారా రైతులకు అవసరమైన ఆధునిక యంత్రాలు, పరికరాలు, పాడి రైతుల కోసం సంచార పశువైద్యశాలలు, పశువులు చనిపోతే పశు నష్ట పరిహారం, ఉద్యాన రైతులకు స్ప్రింక్లర్లు, డ్రిప్, కోల్డ్ స్టోరేజీలు, పట్టు పురుగుల పెంపకం కేంద్రాలు, నేత్రికలు, ఫారంపాండ్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలు అమలు చేస్తోంది.

ఉద్యాన రైతుకూ ఊతం

ఉద్యాన శాఖ ద్వారా సమగ్ర ఉద్యాన పథకం, పండ్ల తోటల నిర్వహణ, నీటి వనరుల ఏర్పాటు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం, యాంత్రీకరణ, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద సేకరణ యంత్రాలు, కోల్డ్ స్టోరేజీలు, హైబ్రిడ్ కూరగాయల ఉత్పత్తి కింద సుమారు 12,505 మంది రైతులకు రూ.6.06 కోట్లు అందజేశారు. దీంతో పాటు పండ్ల తోటల పెంపకానికి ఎన్నో చర్యలు తీసుకుంటున్నారు.

సబ్సిడీతో సూక్ష్మ పరికరాలు

ఏపీఎంఐపీ ద్వారా ఈ ఏడాది రెండు విడతల్లో డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేశారు. 90 శాతం సబ్సిడీతో 19,198 మంది రైతులకు చెందిన 25,402 హెక్టార్లలో సూక్ష్మ పరికరాలను బిగించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.58.29 కోట్లు వ్యయం చేసింది.

'పట్టు' రైతుకు ప్రోత్సాహం

పట్టు రైతులకూ ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తోంది. మల్బరీ మొక్కలు నాటడం, పట్టు పురుగుల పెంపకం గదుల నిర్మాణం, కూలింగ్ పరికరాలు, సోలార్ సిస్టం, చాకింగ్ గదులు, ఫారం మెకనైజేషన కింద సిల్క్ సమగ్ర పథకం తదితర వాటి కింద 2,899 మంది రైతులకు రూ.10.98 కోట్లు వ్యయం చేసింది.

పాడిరైతుకూ సాయం

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు నష్ట పరిహారం కింద ఈ ఏడాది రూ.2.50 కోట్లు పాడి రైతులకు అందజేసింది. దీంతో పాటు ఒక్కో వాకింగ్ ఫ్రిజ్ కోసం రూ.16 లక్షలతో 8 ఫ్రిడ్జ్‌లను ఏర్పాటు చేసింది. ఉచితంగా లక్షల విలువైన గాలికుంటు వ్యాధి నివారణ మందులు అందజేస్తోంది.

అన్నదాతకు తోడుగా..

జిల్లాలో 3,65,875 మంది రైతులుండగా, సాధారణ సాగు విస్తీర్ణం 3,23,763 హెక్టార్లు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏటా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి విత్తన పంపిణీ చేపడతున్నారు. వేరుశనగతో పాటు కంది, పెసర, కొర్ర, సామలు, జీలుగ, రాగితో పాటు చిరుధాన్యాలను సైతం అందజేస్తున్నారు. గత ఏడాదిలో రెండు సార్లు రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు, కోత మిషన్లు సబ్సిడీపై అందజేశారు. ఇందుకు గాను రూ.10.78 కోట్ల సబ్సిడీని రైతుల ఖాతాల్లో జమ చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మూడు విడతల్లో వైఎస్సార్ రైతు భరోసా కింద ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున ఏడాదిలో రూ.371.69 కోట్లు అందజేశారు. ఖరీఫ్‌లో విత్తన సబ్సిడీ కింద రూ.18 కోట్లు, 2022లో ఉచిత పంటల బీమా కింద 1.72 లక్షల మందికి రూ.255.78 కోట్లు అందజేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.31 లక్షలు, 416 సీహెచ్‌సీ గ్రూపులకు 1,165 యంత్ర పరికరాలు అందజేశారు. ప్రస్తుతం వాతావరణ బీమా కింద జిల్లా రైతులకు రూ.157.598 కోట్లు అందజేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 8వ తేదీ కళ్యాణదుర్గం విచ్చేస్తున్నారు.



రైతులకు వైఎస్సార్ రైతు భరోసా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు (ఫైల్)

రైతు సంక్షేమ ప్రభుత్వం



రైతు సంక్షేమం కోరే ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోంది. రైతులను వెన్నంటి ఉండే ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదు. నాకు రైతు భరోసా, పంటల బీమా, విత్తన సబ్సిడీ, యంత్రసేవ ద్వారా లబ్ధి కలిగింది. సీఎం వైఎస్ జగన్ రుణం ఎన్నటికీ తీర్చు కోలేనిది. ఎన్నటికీ ఆయన వెన్నంటే ఉంటా.

– భాస్కర్‌రెడ్డి, బ్రాహ్మణపల్లి, పుట్టపర్తి

రూ.1.50 లక్షలకే కోరిన ట్రాక్టర్



యంత్ర సేవ పథకంలో భాగంగా రూ.15 లక్షల విలువైన ట్రాక్టర్‌ను నేను రూ.1.50 లక్షలకే పొందగలిగాను. నా పొలాన్ని దున్నుకోవడంతో పాటు తోటి రైతులకు తక్కువ బాడుగకే ట్రాక్టర్‌తో పనులు చేస్తున్నా. అలాగే వివిధ పథకాలతో నా కుటుంబానికి మరో రూ.3.5 లక్షల లబ్ధి కలిగింది. ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పథకాన్ని చూడలేదు.

– శ్రీరాములు, ఓబుళరెడ్డిపల్లి, తలుపుల మండలం

ఆలయ ప్రవేశం అడ్డుకోవడం నేరం

- అట్రాసిటీ చట్టం జిల్లాలో పకడ్బందీగా అమలు
- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి
- అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి స్థల సేకరణ చేయాలి: ఎమ్మెల్యే తిప్పేస్వామి



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో ఎస్పీ మాధవరెడ్డి, ఎమ్మెల్యే తిప్పేస్వామి

పుట్టపర్తి అర్బన్: దేవాలయాల ప్రవేశాన్ని అడ్డుకోవడం నేరమని, ఎస్సీ, ఎస్టీలను దేవాలయాల్లోకి రాకుండా ఎవరైనా అడ్డుకుంటే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఎస్పీ మాధవరెడ్డితో కలిసి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని మరింత పగడ్బందీగా, కఠినంగా అమలు చేస్తామన్నారు. అట్రాసిటీ చట్టంపై మరింత అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పుట్టపర్తిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు 15 రోజుల్లోపు స్థల సేకరణ చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటిక ఉండేలా చూడాలని, వాటికి అవసరమైన భూమిని గుర్తించాలన్నారు. ప్రతి మండలంలోనూ ఒక గ్రామంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని, సమావేశాల తేదీ వివరాలు సభ్యులకు తెలియజేసే బాధ్యత ఆర్డీఓలు, తహసీల్దార్లపైన ఉందన్నారు. సమావేశం దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందన్నారు. అట్రాసిటీ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు.

స్థల సేకరణ వేగవంతం చేయాలి

మడకశిర ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి స్థల సేకరణ వేగవంతం చేయాలన్నారు. మడకశిర నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలు లేవని, అవసరమైన భూమిని కేటాయించాలని కోరారు. అమరాపురం మండలంలోని పలువురికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారని, అయితే ఆ స్థలంలో వర్షపు నీరు నిలవడంతో లబ్ధిదారులు కమ్యూనిటీ హాలులో తలదాచుకుంటున్నారన్నారు. అమరాపురం నడి బొడ్డున ప్రభుత్వ స్థలం ఉందని, దాన్ని నిరుపేదలకు ఇచ్చి గృహాలు నిర్మించాలని కోరారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్మశాన వాటికలతో పాటు ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ భాగ్యరేఖ, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్, ఆర్డీఓలు తిప్పేనాయక్, రాఘవేంద్ర, సీపీఓ విజయ్‌కుమార్, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీలత, వరప్రసాద్, శ్రీనివాసులు, హుసేన్‌పీరా, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీటీడబ్ల్యూ మోహన్‌రాం, కమిటీ మెంబర్లు నరసింహమూర్తి, వెంకటేష్, శ్రీనివాసులు, గంగులయ్య, సురేష్, శ్రీహరి, తహసీల్దార్లు, ఏఓలు పాల్గొన్నారు.

జిల్లాకు మంచిపేరు తీసుకురండి

- హౌసింగ్ అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపు



ఉద్యోగికి మెమొంటో, సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, పీడీ చంద్రమౌళిరెడ్డి

పుట్టపర్తి టౌన్: గృహనిర్మాణ అధికారులు, సిబ్బంది కష్టపడి నిబద్ధతతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ అరుణ్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ అరుణ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహ నిర్మాణ శాఖలోని ప్రతి ఒక్క అధికారీ వెయ్యి ఇళ్లకు తగ్గకుండా నిర్మాణాలు పూర్తయ్యేలా చూశారని, ఇది గొప్ప విషయమన్నారు. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 10 వేల ఇళ్ల టార్గెట్ ఇవ్వగా, అధికారులంతా సమష్టిగా పనిచేసి 11 వేల ఇళ్లకుపైగా పూర్తి చేశామన్నారు. అనంతరం 15 వేల ఇళ్ల నిర్మాణాలు లక్ష్యంగా ఇవ్వగా, ఇప్పటివరకూ 83 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. అందువల్లే ఇళ్ల నిర్మాణాల్లో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లా ముందంజలో ఉందన్నారు. ఇందుకు కారణమైన ప్రతి అధికారికీ అభినందనలు తెలిపారు. అనంతరం వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన గృహనిర్మాణ శాఖ ఉద్యోగులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీఈలు నాగరాజు, షామీర్‌బాషా, రంగనాయకులు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ విజయవంతం చేద్దాం



సభా స్థలిని పరిశీలిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, కలెక్టర్, ఎస్పీ, అధికారులు



రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, కలెక్టర్ గౌతమి తదితరులు

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సభను విజయవంతం చేద్దామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు బోయ మంగమ్మ, వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం హోదాలో జగన్ రెండోసారి జిల్లాలో పర్యటించనున్నారన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా ఈ నెల ఎనిమిదో తేదీన కళ్యాణదుర్గం వేదికగా రైతులకు పంటల బీమా సొమ్ము విడుదల చేయనున్నారన్నారు. రైతుల సంక్షేమానికి జగన్ సర్కారు కృషి చేస్తోందన్నారు. రైతు పక్షపాతిగా ధరల స్థిరీకరణ నిధికి రూ.3 వేల కోట్ల కేటాయించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించారన్నారు. సీఎం సభను విజయంతం చేయడానికి అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు..

కళ్యాణదుర్గంలో ఎనిమిదో తేదీ సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. బహిరంగ సభా స్థలి, హెలిప్యాడ్ వద్ద బారికేడ్లు, వీఐపీ గ్యాలరీ ఏర్పాట్లను మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్‌తో పాటు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ కేతన్‌గార్గ్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎంఆర్‌సీ రెడ్డి బుధవారం పరిశీలించారు. పొరపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని అధికారులకు సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, మైనార్టీ నాయకుడు ఫయాజ్, పామిడి వీరా, వీఆర్ రామిరెడ్డి, నర్సేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి

- ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి


విద్యార్థికి జేవీకే కిట్‌ను అందజేస్తున్న రంగస్వామి

మడకశిర/రూరల్: మనబడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారులకు ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి సూచించారు. బుధవారం ఆయన మడకశిర మండలంలో పర్యటించారు. స్థానిక ఎమ్మార్సీలో జేవీకే కిట్లను పరిశీలించారు. అనంతరం ఎంఈఓలు శ్రీనివాస భాస్కర్, నరసింహమూర్తితో సమావేశమై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. అనంతరం మడకశిర మండలం ఆమిదాలగొంది గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. అడ్మిషన్లపై ఆరా తీశారు. విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జావేజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శవ రాజకీయం 'జేసీ'

- సీఐ ఆనందరావు ఆత్మహత్యను అస్త్రంగా చేసుకున్న వైనం
- ప్రజల్లో ఉనికి కోసం మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పాకులాట
- ప్రశాంత వాతావరణానికి ముప్పు తెచ్చే విధంగా వ్యాఖ్యలు

తాడిపత్రి: ఇటు నియోజకవర్గంలోను, అటు టీడీపీ క్యాడర్‌లోను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఉనికి కోల్పోయారు. దీంతో ఎలాగైనా తాడిపత్రిలో పైచేయి సాధించాలనే కుట్రపూరిత ఆలోచనతో సీఐ ఆనందరావు ఆత్మహత్యను రాజకీయాస్త్రంగా వాడుకుంటున్నారు. కుటుంబ కలహాలతో సీఐ ఆనందరావు మూడు రోజుల క్రితం బలవన్మరణానికి పాల్పడ్డారు. సాక్షాత్తు ఎస్పీ శ్రీనివాసరావే తాడిపత్రికి వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సీఐ ఆత్మహత్యకు రాజకీయ, ఉన్నతాధికారుల ఒత్తిళ్లు కారణం కాదని, కుటుంబ సమస్యల వల్లే ప్రాణం తీసుకున్నాడని మీడియాకు వెల్లడించారు. అయితే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాత్రం సీఐ ఆత్మహత్యకు రాజకీయ రంగు పులిమి, హంగామా చేయడం విస్మయం కలిగిస్తోంది. గతంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఘర్షణ పడిన సమయంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వాడన్న చిన్నచూపుతో సీఐ ఆనందరావును జేసీ ప్రభాకర్‌రెడ్డి దుర్భాషలాడారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై తన వర్గీయులు దాడులు చేస్తారు చూస్తావా.. అడ్డుకోవడం నీవల్ల అవుతుందా అంటూ హేళన చేస్తూ బెదిరించారు. ఈ విషయమై సీఐ అప్పట్లోనే స్థానిక డీఎస్పీతో పాటు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

పోలీసులంటే ఎప్పుడూ చిన్నచూపే..

జేసీ సోదరులు అధికారంలో ఉన్నప్పుడు తమ మాట వినని పోలీసులను దుర్భాషలాడడమే కాకుండా, వారి వాహనాలకు నిప్పు పెట్టించి, ఏకంగా పోలీస్ స్టేషన్‌కే తాళాలు వేయించారు. అలాంటి జేసీ సోదరులకు ఇప్పుడు పోలీసులంటే ఎనలేని గౌరవం ఉన్నట్లు మాట్లాడటం చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం సీఐ ఆత్మహత్యను వాడుకోవడాన్ని ఏవగించుకుంటున్నారు.

అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు..

తాడిపత్రిలోని ఆంజనేయస్వామి మాన్యంలో నివసిస్తున్న పేదలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ప్రజలకు మేలు చేయడం గిట్టని జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో హైకోర్టులో కేసులు వేయించి పట్టాల పంపిణీకి అడ్డుపడ్డారు.

- అంబేడ్కర్ నగర్‌లోని మున్సిపల్ స్థలంలో ప్రభుత్వాస్పత్రి ఉప కేంద్రం భవనం నిర్మించడాన్ని జీర్ణించుకోలేక తన అనుచరుడైన టీడీపీ కౌన్సిలర్‌తో హైకోర్టులో పిటిషన్ వేయించి పనులు అడ్డుకున్నారు.
- తాడిపత్రిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పోలీసు ఉన్నతాధికారులతో చర్చించి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ఒప్పించారు. ఎస్పీ కూడా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే తన సొంత డబ్బుతో స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టడం జీర్ణించుకోలేక టీడీపీ కౌన్సిలర్‌తో హైకోర్టులో పిటిషన్ వేయించి స్టే తెప్పించారు.

మున్సిపల్ అధికారులపైనా కక్ష సాధింపు..

- మున్సిపల్ అధికారులు, సిబ్బందిని తన గుప్పిట్లో పెట్టుకోవడానికి చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కక్షసాధింపులకు దిగారు. ప్రొటోకాల్ పేరుతో దూషణలు, బెదిరింపులతో భయకంపితులను చేస్తున్నారు.
- మున్సిపాలిటీలోని వ్యవహారాలన్నీ తన కనుసన్నల్లోనే జరగాలని, అధికారులందరూ తాను చెప్పినట్లే వినాలని హుకుం జారీ చేశారు.

ప్రశాంతతకు భంగం కలిగించేందుకే..

కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత తాడిపత్రిలో శాంతిభద్రతల విషయంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. మూడు దశాబ్దాల తమ ఏక ఛత్రాధిపత్యానికి చెక్ పడటం జేసీ ప్రభాకర్‌రెడ్డికి మింగుడు పడలేదు. ఎలాగైనా తమ ప్రాభవం తిరిగి సంపాదించుకునేందుకు ఏదో ఒక అలజడి సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారు.

- ఇప్పుడు అస్త్రంగా ఏకంగా ఓ సీఐ స్థాయి అధికారి ఆత్మహత్యను తెరపైకి తీసుకువచ్చి, అందుకు రాజకీయ రంగును పులిమి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరును ప్రజలు ఏవగించుకుంటున్నారు. రెండు రోజుల క్రితం నల్లదుస్తులు, నల్ల రిబ్బన్లు ధరించి సీఐ ఆనందరావుకు నివాళులర్పించడాన్ని కొన్ని దళిత సంఘాలతో పాటు తాడిపత్రి వాసులు కొందరు తప్పుపడుతున్నారు. సీఐ ఆనందరావు దళితుడైనందునే జేసీ దివాకర్‌రెడ్డి నల్ల దుస్తులు ధరించి అగౌరవపరిచారని దళితులు కొందరు జేసీ తీరును తప్పుబట్టారు.



అనుచరుల కోసం చాంబర్..

మున్సిపల్ చైర్మన్ హోదాను అడ్డుపెట్టుకున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా ఏ మున్సిపాలిటీలో లేని విధంగా రెండు చాంబర్లను ఆక్రమించుకున్నారు. అధికారుల వద్ద ఉండాల్సిన తాళాలను కూడా తనవద్దే ఉంచుకున్నారు. జేసీ విపరీత పోకడలను తాళలేని సిబ్బంది మూకుమ్మడిగా సెలవుపై వెళ్లేందుకు నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే ఏ మున్సిపల్ కమిషనర్ వచ్చినా ఆయన పేరు వినిపించకుండా తాడిపత్రి మున్సిపాలిటీ అంటే జేసీపీఆర్ అని వినిపించేందుకు సిద్ధపడితేనే ఇక్కడ ఉండనిస్తామని తన కౌన్సిలర్ల ద్వయం వచ్చే ప్రతి అధికారికీ హెచ్చరికలు చేస్తున్నట్లు సమాచారం.

మెరుగైన వైద్యం అందించండి

- జిల్లాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు


మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: హిందూపురంలోని జిల్లా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి లోపల, బయట పరిశుభ్రతను పాటించాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలోని రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. ప్రతి కొనుగోలుకు సంబంధించిన వివరాలు రికార్డులో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రహరీని పడగొట్టే విషయం పరిశీలించాలని డీసీహెచ్‌ఎస్‌ను ఆదేశించారు. నేమ్ బోర్డు ఏర్పాటుకు దాతల సహకారం తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగిరెడ్డి మాట్లాడుతూ.. డ్రిల్లింగ్ మిషన్ ఏర్పాటు చేయాలని, గార్బేజ్, బయోవేస్ట్ ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. సిబ్బందికి వాష్‌రూంలు ఏర్పాటు చేయాలన్నారు. డ్యూటీ డాక్టర్ల సమయ వేళలు ప్రదర్శించాలని, రాత్రి పూట డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సిటీ స్కానింగ్ మిషన్, ఆర్థోపెడిక్ డ్రిల్లింగ్ మిషన్, ఐటీటీ సర్జన్ చైర్, ఇంటర్నెట్ కనెక్షన్, ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్, ఆక్సిజన్ రీఫిల్లింగ్, ల్యాబ్ ఐటమ్స్ కొనుగోలుకు కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎంటీ నాయక్, జిల్లాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్‌కుమార్, ఆర్‌ఎంఓ రుక్మిణమ్మ, హెడ్ నర్స్ సౌదామిని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సుదర్శన్, శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నాగ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

- డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) టర్నోవర్ రూ.2 వేల కోట్లకు చేరుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత అన్నారు. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి సంబంధించి బ్యాంక్ లావాదేవీలపై బ్రాంచి మేనేజర్లతో స్థానిక డీసీసీబీ హాలులో బుధవారం ఆమె సమీక్షించారు. ప్రస్తుతం రూ.1,700 కోట్ల లావాదేవీలతో నడుస్తోందన్నారు. నెలవారీగా ప్రణాళికను రూపొందించుకుని లక్ష్య సాధన దిశగా నడిపించే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. నిరర్థక ఆస్తులను (ఎన్‌పీఏ) 13 శాతం నుంచి 5 శాతం లోపు ఉండేలా మొండిబకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులు, మహిళలు, జేఎల్‌జీ గ్రూపులకు, బంగారు నగల తాకట్టుకు విరివిగా రుణాలు ఇవ్వడంతో పాటు ప్రజలను చైతన్య పరిచి పెద్ద ఎత్తున డిపాజిట్లను సేకరించాలన్నారు. సమీక్షలో సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవబాబు, రవికుమార్, నాబార్డు డీడీఎం అనురాధ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి

అనంతపురం రూరల్: ఉమ్మడి జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాలు, కళాశాల జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 4న బాలురకు బి పప్పూరు గురుకులంలో, 5న బాలికలకు కురుగుంట గురుకుల కళాశాలలో ప్రవేశపరీక్ష మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. 89 మంది విద్యార్థినులు, 54 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురుకులాల ప్రవేశాలు పూర్తి పారదర్శకతతో మెరిట్ ఆధారంగా భర్తీ చేశామన్నారు. ఎవరూ ఇతర మార్గాల ద్వారా సీట్ల భర్తీకి ఆశించి మోసపోవద్దని విద్యార్థులకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

రాగి సాగు విస్తీర్ణం పెరగాలి

- జాయింట్ కలెక్టర్ చేతన్


అధికారులతో మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో రాగి పంట సాగు విస్తీర్ణం మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశించారు. రాగి పంట సాగుపై వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమీక్షించారు. చౌక దుకాణాల్లో కార్డుదారులకు అందజేయడానికి రాగులు చాలా అవసరమన్నారు. ఈ క్రమంలో రాగి పంటకు ప్రభుత్వం రూ.3,846 కనీస మద్దతు ధర కల్పిస్తోందన్నారు. ఈ విషయాన్ని రైతులకు వివరించి రాగి పంట సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. రాగి పంట సాగు చేసిన రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో సీడ్, మినీ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. విత్తన పంపిణీని జాగ్రత్తగా చేపట్టాలన్నారు. కౌలు రైతులకు జగనన్న సురక్ష కార్యక్రమంలో సీసీఆర్సీలను అందజేయాలన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, డీఎం అశ్వత్థ నారాయణ నాయక్, ఏపీ సీడ్స్ డీఎం ధనలక్ష్మి, ఏడీఏలు రవీంద్ర, కృష్ణమీనన్, స్వయం ప్రభ పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

పావగడ: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకాలోని కేటీహళ్లికి చెందిన నరసింహమూర్తి (46) బుధవారం ఉదయం మంగళవాడ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మంగళవాడలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలుపుతుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నరసింహమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న అరసికెర ఎస్‌ఐ ధారాసింగ్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పారామెడికల్ కోర్సుల అభ్యాసనకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం క్రైం: పారా మెడికల్ కోర్సుల్లో శిక్షణకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డీఎంఎల్‌టీ, డీఓఏ, డీఏఎన్ఎస్, డీఎంఐటీ, డీఇసీజీ, డీఆర్‌జీఏ, డీడీఆర్ఏ కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు www.appmb.org.in, http://dme.ap.nic.in, www.appmb.co.in వెబ్‌సైట్‌లను సందర్శించాలని సూచించారు.

అటానమస్ వైపు ఇంజినీరింగ్ కాలేజీల చూపు

అనంతపురం: ప్రైవేట్ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలు అటానమస్ (స్వయం ప్రతిపత్తి) గుర్తింపు కోసం ఉత్సాహం కనబరుస్తున్నాయి. నూతన జాతీయ విద్యావిధానం–2020 ప్రకారం ప్రతి కళాశాల అటానమస్ హోదా పొందేలా తీర్చిదిద్దాలని పేర్కొనడం ఇందుకు ఊతమిస్తోంది. అటానమస్ హోదా తెచ్చుకునే కళాశాలలు అధికమయ్యే కొద్దీ యూనివర్సిటీ ప్రాభవం క్రమేణా తగ్గుముఖం పడుతుంది. జేఎన్‌టీయూ పరిధిలో నెల్లూరు , కర్నూలు, ప్రొద్దుటూరులో ఒక్కో ఇంజినీరింగ్ కళాశాల, చిత్తూరు జిల్లాలో రెండు ఇంజినీరింగ్ కళాశాలలు, రాజంపేటలో ఒక ఫార్మసీ కళాశాలలు 2023–24 విద్యా సంవత్సరంలో అటానమస్ హోదాకు దరఖాస్తు చేశాయి. న్యాక్ అక్రిడిటేషన్–ఏ గ్రేడ్ కూడా ఉండడంతో అటానమస్ హోదా దక్కడం లాంఛనమే కానుంది. జేఎన్‌టీయూఏ పరిధిలో మొత్తం 129 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా, ఇందులో ఇప్పటికే 26 ఇంజినీరింగ్ కళాశాలలు, 2 ఫార్మసీ కళాశాలలు అటానమస్ హోదాలో ఉన్నాయి. మరో 5 ఇంజినీరింగ్, ఒక ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా దక్కితే మిగిలిన 95 కళాశాలలు యూనివర్సిటీకి అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలుగా ఉండనున్నాయి.

చెంతకే పౌష్టికాహారం

ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతున్నాయి. తాజాగా అంగన్‌వాడీలో సమూల మార్పులకు జగనన్న సర్కారు శ్రీకారం చుట్టింది. గర్భిణులు, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారాన్ని పాత పద్ధతిలో ఇంటి వద్దకే చేర్చేందుకు చర్యలు తీసుకుంది. ఆగస్టు నెల నుంచి ఈ విధానం అమలు కానుంది.

- అంగన్‌వాడీలో సమూల మార్పులు
- వచ్చే నెల నుంచి పాత పద్ధతిలోనే టీహెచ్‌ఆర్ అమలు
- లబ్ధిదారుల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకున్న జగనన్న సర్కారు


అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	2,302
7 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారుల సంఖ్య	1,03,152
గర్భిణుల సంఖ్య	18,428
బాలింతల సంఖ్య	16,558

రాయదుర్గం: మాతాశిశు సంరక్షణ, పూర్వప్రాథమిక విద్య పటిష్టతపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆంగ్ల మాధ్యమంలో పూర్వ ప్రాథమిక విద్య (ప్రీస్కూల్)ను అమలు చేస్తోంది. అలాగే గర్భిణులు, బాలింతలకు నెలలో 25 రోజులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ (అటుకులు, రాగిపిండి, జొన్నపిండి, కందిపప్పు ఒక్కో కిలో, బెల్లం, చిక్కీలు, ఎండు ఖర్జూరం పావు కిలో చొప్పున) కిట్లను అందజేస్తోంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ (చిరుధాన్యాల మిశ్రమ గోధుమపిండి 2 కిలోలు, చిక్కీలు, ఎండు ఖర్జూరం, బెల్లం, రాగిపిండి ఒక్కొక్కటి అర కిలో చొప్పున) కిట్ పంపిణీ చేస్తోంది. అంతేకాక మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రంలోనే పూర్వప్రాథమిక విద్య విద్యార్థుల (3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు)తో కలిసి గర్భిణులకు పోషకాలతో కూడిన వేడివేడి భోజనం, పాలు, కోడిగుడ్లు కూడా అందిస్తోంది.

కేంద్రాలకు రాలేని వారి కోసం..

గర్భిణులకు నెలలు నిండడం, ఇతర ఆరోగ్య సమస్యలు, బాలింతలకు చిన్నారుల సంరక్షణ వంటి వాటి కారణాలతో 300 నుంచి 500 మీటర్ల దూరంలో ఉండే అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడం కష్టమైంది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఇబ్బందులు తెలుసుకునేలా ముందుగా సర్వే చేపట్టింది. కేంద్రాలకు వచ్చి భోజనం చేస్తారా? లేదా సరుకులు ఇంటికే తీసుకెళతారా? అనే అంశాలపై అభిప్రాయాలు సేకరించారు. ఉన్నతాధికారులు కొందరు లబ్ధిదారులకే ఫోన్ చేసి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఎక్కువ మంది ఇంటికే ఇస్తే బాగుంటుందనడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో గర్భిణులకు జూలై ఒకటి నుంచి భోజనం పెట్టడం కుదరనందున టేక్ హోమ్ కేర్ విధానంలో 3 కిలోల బియ్యం, కిలో బేడలు, అరకిలో వంటనూనెతో పాటు 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు అనుబంధ పోషకాహారం కింద 2.5 కిలోల బాలామృతం, 2.5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు ఇంటికే అందిస్తారు.

చాలా సంతోషంగా ఉంది

కేంద్రాల వద్దకే వెళ్లి భోజనం చేయాలంటే సమయం వీలుపడక కొన్ని సందర్భాల్లో ఇబ్బంది పడ్డాం. ముఖ్యంగా నెలలు నిండే కొద్దీ గర్భిణులు, పసి పిల్లలున్న బాలింతలు కేంద్రాలకు వెళ్లడం సాధ్యపడడం లేదు. ఇదే విషయాన్ని ఇటీవల సర్వే అధికారులకు వివరించాం. మా అభిప్రాయానికే ప్రభుత్వం మొగ్గు చూపడం సంతోషంగా ఉంది. సీఎం జగన్‌కు మహిళలు, చిన్నారులు రుణపడి ఉంటారు.

– శ్రీదేవి, గర్భిణి, ఓబుళాపురం, డి హీరేహాళ్ మండలం

రెండు విడతలుగా పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాల్లో వండిపెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని తొలగించి పాత పద్ధతిలో ఇళ్లకే సరుకులు అందించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీలోపు మొదటి విడతగా బియ్యం, కందిపప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు, రాగిపిండి, అటుకులు, బెల్లం, చిక్కీలు, ఖర్జూరం అందిస్తారు. అలాగే 16, 17 తేదీల్లో రెండో విడతగా కోడిగుడ్లు, పాలు అందజేసేలా ప్రణాళికలు రూపొందించాం.

– శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ, అనంతపురం